క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతిపత్రం



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శంకరపట్నం: 16న శంకరపట్నం బంద్‌కు పిలుపునిస్తున్నామని తెలుపుతూ మంగళవారం ఏఐటీయూసీ నాయకులు తహసీల్దార్ అనుపమకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లాకార్యదర్శి పిట్ల సమ్మయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేకతను నిరసిస్తూ బంద్ చేపడుతున్నామని, మండల కేంద్రంలో శాంతియుత ర్యాలీతో పాటు బంద్ నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో కన్నం సదానందం, బొజ్జ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న హరిత

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన దుకిరే రాజు వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండలంలోని ఘన్ముక్కుల గ్రామానికి చెందిన గాజుల హరిత(ట్రాన్స్‌జెండర్)మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు అందించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, పిల్లల చదువుకు తనవంతు సాయం అందిస్తానని హరిత తెలిపారు. కార్యక్రమంలో లకోట రాజవీరు, మోర్తాల రఘువరన్, దొండపాటి సదాశివరెడ్డి, రాజు, రమేశ్ తదితరులు ఉన్నారు.

చొప్పదండి: మండల పరిధిలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన గీకురు శేఖర్ మృతిచెందగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మంగళవారం మృతుడి కుటుంబాన్ని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్తూరు మహేశ్ పరామర్శించి రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ఎల్లాల ఆదిరెడ్డి, నాయకులు సోమిడి శ్రీనివాస్, గడమల్ల గంగారాం, తిరుపతిరెడ్డి, తాండ్ర వేణుగోపాల్, నల్లాల అఖిల్, గుండేటి విజయ్ పలువురు పాల్గొన్నారు.

గంగాధర అర్చక సంఘం

గంగాధర: ధూపదీప నైవేద్య అర్చక సంఘం గంగాధర మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సముద్రాల శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షుడిగా కూర్మాచలం మంగయ్య, ప్రధాన కార్యదర్శిగా వకుళాభరణం హరికిషన్ కోశాధికారిగా సుదర్శనం కిషోర్, ఉపాధ్యక్షుడిగా శ్రీపతి మార్కండేశ్వర్ ఎన్నికయ్యారు.

సీసీఈ విధానం పక్కాగా అమలు చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న హెచ్‌ఎంలు

రామడుగు: మండలంలోని వెలిచాల సరస్వతి పాఠశాల, గోపాల్‌రావుపేట, గుండి జిల్లా పరిషత్ పాఠశాలలు, శ్రీ ప్రగతి, అక్షర పాఠశాలలో సీసీఈ (విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలన) విధానాన్ని ఐదు ప్రత్యేక బృందాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వెదిర స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి రాజమౌళి మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో సీసీఈ విధానం పక్కాగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డి. పద్మజ, రంగనాథశర్మ, టి.పద్మ, అవదూత శ్రీనివాస్, దయానంద్, రవీందర్, కిషన్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

ఒత్తిడి అధిగమించినప్పుడే మంచి ఫలితాలు



అవగాహన కల్పిస్తున్న రమణాకర్

రామడుగు: విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించినప్పుడే మంచి ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని ప్రముఖ సైకాలజిస్ట్ రమణాకర్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఒత్తిడిని జయించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరీక్షలకు ఏలా సన్నద్ధం కావాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జయలక్ష్మి, పీడీ రమేశ్, ఉపాధ్యాయులు శైలజ, శిరీషా, జ్యోతి, మంజుల, ప్రేమ్‌సాగర్ పలువురు పాల్గొన్నారు.

ఇటు పనులు.. అటు ప్రమాదాలు

- కరీంనగర్ –వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు
- సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



శంకరపట్నం: కరీంనగర్ –వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. విస్తరణ పనులు మానకొండూర్ నుంచి శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం వరకు చురుగ్గా సాగుతున్నాయి. మానకొండూర్ మండలం ముంజంపల్లి శివారు నుంచి శంకరపట్నం మండలం తాడికల్ శివారు వరకు గతంలో ఉన్న డబుల్‌రోడ్డులో కొంత భాగాన్ని తొలగించి ఎడమవైపు బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈక్రమంలో తాడికల్ శివారులో అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన యువకుడు రాత్రి సమయంలో కరీంనగర్‌లో ఉద్యోగం ముగించుకొని బైక్‌పై వస్తుండగా ప్రమాదానికి గురైనాడు. ఈసంఘటన మరకవముందే అదే ప్రాంతంలో రెండుకార్లు ప్రమాదానికి గురయ్యాయి. దీంతో వాహనదారుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల కరీంనగర్‌కు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి విజయవాడకు స్నేహితుడు సదానందంతో కలిసి కారులో బయలుదేరాడు. సదానందం సోదరి, గీత, తల్లి కొమురమ్మతో కలిసి హన్మకొండకు వెళ్తుండగా పొగమంచు కారణంగా కొత్తగట్టు మత్స్య గిరీంద్రస్వామి ఆలయ సమీపంలో రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన టిప్పర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో ప్రభాకర్, కొమురమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. గొల్లపల్లి శివారులో రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో కొత్తగట్టుకు చెందిన సాంబశివరెడ్డి మృత్యువాత పడ్డాడు. కొత్తగట్టు–సింగాపూర్ గ్రామాల మధ్య ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బైపాస్‌రోడ్డు నిర్మాణంతో పాటు నాలుగు వరుసల రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో రాత్రి వేళ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపనులు జరుగుతున్న ప్రదేశాల్లో ప్రమాద సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని, ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎదుగుదలకు పౌష్టికాహారం ముఖ్యం



గన్నేరువరం: విటమిన్ ఏ ద్రావణం పంపిణీ



జమ్మికుంటలో...

గన్నేరువరం: పిల్లల ఎదుగుదల, బరువు పెరగడానికి పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇష్రాత్ సుల్తానా అన్నారు. మండలంలోని చొక్కారావుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల బరువు, ఎత్తును మంగళవారం లెక్కించారు. అలాగే విటమిన్ ఏ ద్రావణం అందించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారద, ఆయా, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట: మండలంలోని వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ సనజవేరియా పర్యవేక్షణలో ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మంగళవారం విటమిన్ ఏ ద్రావణం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... తొమ్మిది నెలల నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ విటమిన్ ఏ ద్రావణం అందించాలన్నారు. మండల పరిధిలోని చిన్నారులకు పంపిణీ చేసే కార్యక్రమం కొనసాగుతుందని, విటమిన్ ఏతో కంటిచూపు సమస్యలు, దృష్టిలోపం రాకుండా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మమతప్రసాద్, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: 16న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ పోస్టర్‌ను స్థానిక ఆటో ట్రాలీ అడ్డా వద్ద ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి, సీఐటీయూ జిల్లా నాయకులు కదిరె రమేశ్ మాట్లాడారు... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం టోల్‌గేట్ల స్థానంలో జీపీఎస్ విధానం ప్రవేశపెట్టడాన్ని తిరేకిస్తున్నామన్నారు. జీపీఎస్‌తో ఒక్కో వాహనంపై రూ. ఎనిమిది వేల ఖర్చుపడుతుందని, డ్రైవర్లు భరించలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రవాణా రంగ కార్మికులకు నిరాశపరచిందని, ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్ల ఉపాధికి గండి పడిందని, కుటుంబాలు రోడ్డుపాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ చార్జీలు వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 15 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, డ్రైవర్లకు ప్రభుత్వమే ఉపాధి కల్పించాలన్నారు. బీడీ, గీత ,నేత కార్మికులకు ఇస్తున్నట్లు డ్రైవర్లకు నెలకు జీవనభృతి కింద రూ. 4,500 ఇవ్వాలని, అదేవిధంగా రూ.10 లక్షలు ప్రమాద బీమా, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కేరళ మాదిరిగా ప్రభుత్వమే సవారి యాప్ అమలు చేసి డ్రైవర్లను ఆదుకోవాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫిట్నెస్ రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలు సుంకం తగ్గించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌లో హుజూరాబాద్ మండల వ్యాప్తంగా ఉన్న లారీ, బస్సు, కారు, ఆటో, ట్రాలీ, ట్రాక్టర్, అన్ని రకాల వాహనదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రాలీ అడ్డా అధ్యక్షుడు లింగాల సంపత్, ఉపాధ్యక్షుడు ఎర్ర సంజీవ్, ఉప్పుల రమేశ్, ఎండీ. హుస్సేన్, ఎండీ.జాఫర్, మైసూర్ సమ్మయ్య, రాధాకృష్ణ, ఐలయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


గంగాధర: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపిన వివరాలు..మండలంలోని గట్టుబూత్కూర్‌కు చెందిన ఐలయ్య (52) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆసుపత్రులకు వెళ్లిన నయం కాకపోవడంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి సోదరుడు గొల్లభక్తుని పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

కెమిస్ట్రీతో ఉద్యోగ అవకాశాలు

హుజూరాబాద్‌రూరల్: ఎమ్మెస్సీ కెమిస్ట్రీతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని శాతవాహన ప్రొఫెసర్ కె. రాజు అన్నారు. మండలంలోని సింగాపూర్ వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తయిన తరువాత ఎన్టీపీసీ,ఆర్‌ఎఫ్‌సిఎల్, ఫార్మసి ఇండస్ట్రీ, ఎరువులు, కర్మాగారాలు లాంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభ్యమవుతాయని తెలిపారు. అమెరికా, ఆస్ట్రేలియా జర్మనీ లాంటి దేశాల్లో కెమిస్ట్రీ చదివిన వారికి మంచి డిమాండ్ ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్ హనుమాన్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

అప్పట్లో రేడియోకు లైసెన్స్ ఫీజు

ఈరోజుల్లో ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో ప్రపంచమంతటా తెలిసిపోతోంది. కానీ ఇంత టెక్నాలజీ రాకముందు రేడియోనే అతిపెద్ద ప్రసార సాధనంగా ఉండేది. ఇంట్లో రేడియో ఉంటే పెద్ద హోదా ఉన్నట్టు అనుకునే వాళ్లు. దేశంలో జరిగే పరిణామాలు, వార్తలు, ఉపద్రవాలు, పాటలు, ఇతర విశేషాలు రేడియో ద్వారా తెలుసుకొని ఊరిలో మాట్లాడుకునేవారు. ఫిబ్రవరి 13 ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా పలువురు రేడియోతో వారికి ఉన్న అనుబంధాన్ని 'సాక్షి'తో వెల్లడించారు.



జమ్మికుంట: నాపేరు రామిడి జనార్దన్‌రెడ్డి, మడిపల్లి గ్రామం. 60 ఏళ్ల క్రితమే మా ఇంట్లో రేడియో ఉండేది. అప్పట్లో మాది ఉమ్మడి కుటుంబం, ఇంట్లో రేడియో ఉంటే హోదా పెద్దది అనుకునే వాళ్లు. మా బంధువుల ఇంట్లో రేడియో ఉంటే మా ఇంట్లో కూడా ఉండాలని మా నాన్న రేడియో కొనుగోలు చేశారు. ఉమ్మడి కుటుంబం వేరు పడగా పంపకాల్లో భాగంగా రేడియో మా అన్న తీసుకున్నారు. అప్పుడు రూ. 450 పెట్టి ఫిలిప్స్ రేడియో కొని వార్తలు, పాటలు వింటూ ఉండేవాళ్లం. అప్పట్లో రేడియోకు లైసెన్స్ కార్డు ఉండేది. లైసెన్స్ కార్డు సమయం అయిపోతే రేడియోకు ఫీజు కట్టే తేదీ అయిపోయిందని ప్రసారం మధ్యలో తెలిపేది. దీంతో సంవత్సరానికి రూ.15 ఫీజు చెల్లించేది. కొంతకాలం హుజూరాబాద్ తర్వాత జమ్మికుంట పోస్టుఆఫీస్‌లో లైసెన్స్ ఫీజు చెల్లిస్తే సంవత్సరం వరకు అంతరాయం లేకుండా ప్రసారం జరిగేది. అరవై ఏళ్ల క్రితం నుంచి రేడియోలో వార్తలు, పాటలు, ఎఫ్ఎం వింటున్నాను. ఆరోజుల్లో ఎవరి ఇంట్లో రేడియో లేకుండేది. మా ఇంట్లోనే ఉండేది అందరు వచ్చి వార్తలు, ఇతర విషయాలు ఏంటని మమ్మల్ని అడిగేవారు.

ఘన స్వాగతం



జమ్మికుంట: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 1400 మంది రామ భక్తులు, బీజేపీ నాయకులు అయోధ్య రాములోరిని దర్శించుకునేందుకు ప్రత్యేక రైళ్లలో వెళ్లారు. తిరిగి పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు చేరుకోగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సోమవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా కృష్ణారెడ్డి, నాయకులు ఎర్రబెల్లి సంపత్‌రావు, జీడి మల్లేశ్, శ్రీలం శ్రీనివాస్ మాట్లాడారు. హిందువుల ఆరాధ్యదైవం శ్రీరాముడు పుట్టిన అయోధ్యలో రామ మందిరం నిర్మాణంతో హిందువుల కోరిక తీరిందన్నారు. బీజేపీ ఎన్నికల్లో పెట్టిన మేనిఫెస్టో ప్రకారం రామ మందిరం నిర్మాణం పూర్తయిందని, ప్రధాని నరేంద్ర మోదీ విద్వేషాలు, గొడవలకు తావు ఇవ్వకుండా నిర్మాణం చేసి హిందువుల కల సాకారం చేసి రాములోరిని దర్శించుకునేందుకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసి దర్శన భాగ్యం కలిగించారని పేర్కొన్నారు. రాముడిని దర్శించుకొని ఆయన కృపకు పాత్రులు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

విరాళాలతో మినీపార్క్



ఎంపీడీవోను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

జమ్మికుంట: సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు, ఉద్యోగులకు ఆహ్లాదకర వాతావరణం అందించడానికి మినీపార్క్ నిర్మించడం సంతోషంగా ఉందని ఎంపీడీవో కల్పన అన్నారు. ఎంపీడీవో కార్యలయం వద్ద ఉద్యోగులు, సిబ్బంది విరాళాలతో నిర్మించిన మినీపార్క్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పనిఒత్తిడి ఉన్నప్పటికీ కార్యాలయం ఆవరణలో పార్క్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో 20 మంది కార్యదర్శుల సొంత డబ్బులతో నిర్మించడం అభినందనీయమన్నారు. బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో సేవలు మర్చిపోలేనివని ఎంపీపీ దొడ్డె మమత ప్రసాద్ అన్నారు. వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఉద్యోగులకు బదిలీలు తప్పవని, ఎక్కడికి వెళ్లినా ఉన్నతాధికారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సతీశ్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



రామడుగు: చొప్పదండి సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాశ్ గౌడ్‌ను మండలానికి చెందిన నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బత్తిని తిరుపతిగౌడ్, మీస లచ్చయ్య, మామిడి వీరన్న, మహేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండర్ డిస్క్రిమినేషన్ పోటీల్లో జిల్లా స్థాయిలో బహుమతి సాధించారు. బహుమతి సాధించిన గోని వైష్ణవి. పింగిలి అనన్య, పల్లి ప్రణయ, రంగు సుస్మిత, వెలుముల సహస్ర, వెలుముల శ్రీ చరణ్, కొక్కోల శివమణి, గైడ్ టీచర్ కేతిరి శ్రావణ్‌కుమార్‌ను మంగళవారం హెచ్‌ఎం జీపీపీ రంగనాథశర్మ, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవధూత శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



నర్సయ్యకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది



గంగాధర: ఎంపీడీవోను అభినందిస్తున్న సిబ్బంది



సైదాపూర్ : బాధ్యతలు స్వీకరించిన యాదగిరి

మానకొండూర్‌రూరల్: మానకొండూర్ ఎంపీడీఓగా మంగళవారం ఎం. నర్సయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీఓ దివ్యదర్శన్‌రావు ఎన్నికల బదిలీపై కరీంనగర్ వెళ్లారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి పాలనలో ఎంపీవో విధులు నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది ఎంపీడీఓకు స్వాగతం పలికారు. ఎంపీఓ రాజేశ్వర్‌రావు, సిబ్బంది భరత్, ప్రసాద్ ఉన్నారు.

గంగాధర: ఎంపీ ఎన్నికల సందర్భంగా సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం నుంచి బదిలీపై వచ్చిన ఎంపీడీవో దమ్మని రాము మంగళవారం విధుల్లో చేరారు. కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

సైదాపూర్: సైదాపూర్ ఎంపీడీవోగా బి.యాదగిరి బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా అంతర్గాం ఎంపీడీఓగా పని చేసిన యాదగిరి రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా సైదాపూర్‌కు బదిలీపై వచ్చారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి స్వాగతం పలికారు.

తిమ్మాపూర్: తిమ్మాపూర్ ఎంపీడీఓగా తూమట్ల విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. తిమ్మాపూర్ ఎంపీడీవోగా పని చేసిన సి.రవీందర్‌రెడ్డి జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. పెద్దపెల్లి జిల్లా రామగిరి ఎంపీడీవోగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ కరీంనగర్ జిల్లాకు బదిలీపై రాగా కలెక్టర్ తిమ్మాపూర్ పోస్టింగ్ ఇచ్చారు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన విజయకుమార్ 25 ఏళ్ల నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వీడీవో స్థాయి నుంచి పనిచేశారు. విజయ్‌కుమార్ మంథని డివిజన్‌లోని మంథని, కమాన్‌పూర్, రామగిరితోపాటు, మానకొండూర్ మండలంలో పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్‌కు ఎంపీఓ కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రావణ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

గన్నేరువరం: గన్నేరువరం ఎంపీడీవోగా తీగల శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన ఆవునూరి స్వాతి బదిలీపై జగిత్యాల జిల్లాకు వెళ్లారు. ఇల్లందకుంట మండలం నుంచి తీగల శంకర్ బదిలీపై వచ్చారు. ఎంపీవో నర్సింహారెడ్డి, కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండి ఎంపీడీవోగా వేణుగోపాల్ రావు బాధ్యతలు స్వీకరించారు. జూలపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఎంపీడీవోకు మండల సిబ్బంది స్వాగతం పలికారు.

'ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను బొందపెడతాం'



మాట్లాడుతున్న నాయకులు

హుజూరాబాద్: ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఉద్యమకారులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని, ఉద్యమకారులను గుర్తించలేదని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను చైతన్యపరిచి బీఆర్‌ఎస్ పార్టీని బొందపెడతామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కనకం కుమారస్వామి, ఊకంటి మల్లాచార్యులు అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు...పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఏనాడు ఉద్యమకారులను పట్టించుకోలేదన్నారు. ఉద్యమకారుల జీవితాలతో చెలగాటమాడిందన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు పల్లెపల్లెకు వెళ్లి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశ్, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం అధ్యక్షులు సంతోష్, సదానందం, దేవునూరి అంకుస్, జిల్లా కార్యదర్శి కనకం సాగర్, శంకర్, అఫ్జల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ఇవ్వలేదని దూషణలు



మాట్లాడుతున్న కౌన్సిలర్లు రాజు, మల్లయ్య

జమ్మికుంట: మున్సిపల్ అవిశ్వాస పరీక్షలో మద్దతు తెలుపలేదని మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు సోమవారం రాత్రి ఓ వివాహ వేడుకల్లో కలిసి దూషించాడని ఆయన ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామని కౌన్సిలర్లు రావికంటి రాజు, పొనగంటి మల్లయ్య ఆరోపించారు. మంగళవారం పట్టణంలో కౌన్సిలర్లతో కలిసి మాట్లాడారు. 30 మంది కౌన్సిలర్లు భిక్ష వేస్తేనే చైర్మన్ అయ్యావు, చైర్మన్‌గా అనేక అవినీతి అక్రమాలకు పాల్పడటంతో అవిశ్వాసం పెట్టామన్నారు. చైర్మన్ పదవిలో ఉన్నవ్యక్తి బాధ్యతగా ఉండాలని, తప్పులు సరిదిద్దుకునేందుకు ప్రవర్తించకుండా దూషణలు, దాడులు, ఆరోపణలు, నిందలు వేస్తే ఊరుకునేది లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సిబ్బందికి, కౌన్సిలర్లకు సరైన గౌరవం ఇవ్వలేదని, ఏకచక్రాధిపత్యం వహించి కౌన్సిలర్లను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని సర్వేనంబర్ 629లో ప్రభుత్వ భూమి కబ్జా చేసి బినామీలకు కట్టబెట్టేదుకు 59 జీవో ద్వారా దరఖాస్తులు చేసుకున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకుంటుందన్నారు. దుషించి, దాడికి యత్నించినందుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొంగోని వీరన్న, మారపల్లి భిక్షపతి, పొనగంటి రము, దిడ్డి రాము, కూతాడి రాజయ్య, పొనగంటి సారంగం, నాయకులు గుల్లి మొగిలి,దేశిని సదానందం, పిట్టల రమేశ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం అందని భోజనం



భోజనం చేస్తున్న విద్యార్థులు

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తలేరని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 593 మంది విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం గుడ్డు, వారానికి మూడు రోజులు చికెన్ అందిచాల్సి ఉంది. కానీ హెచ్‌ఎం విద్యార్థులకు భోజన సౌకర్యాలను కల్పించట్లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ అందుబాటులో ఉన్న కూరగాయలు పంపడంతో విధిలేక విద్యార్థులు కడుపు మాడ్చుకుంటున్నారని వాపోయారు. క్యారెట్, బీట్‌రూట్, కూరగాయలు వండకుండా చారు, పప్పు, నాసి రకం కూరగాయలు వండుతున్నారని, గుత్తేదారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నాసికరం కూరగాయలు సరఫరా చేస్తున్న ప్రిన్సిపల్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇకనైనా అధికారులు స్పందించి నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'లైబ్రేరియన్' ఫలితాల్లో సత్తాచాటిన 'రూన్సీ పటేల్'



రూన్సీపటేల్

జమ్మికుంట: జమ్మికుంట టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ మండ వెంకటేశ్వర్లు కూతురు రూన్సీపటేల్ ఇటీవల వెలువడిన లైబ్రేరియన్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటరు. రెసిడెన్సియల్ స్కూళ్లలో లైబ్రేరియన్ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించింది. రూన్సీపటేల్ గతంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మొదటి అడిషనల్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించారు. లైబ్రేరియన్ పోస్టుల్లో సత్తా చాటడంతో వెంకటేశ్వర్లుతోపాటు సహ ఉద్యోగులు, బంధువులు స్వీట్లు పంపిణీ చేసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.